


RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 02 సంచిక : 92 | శనివారం 3 - 5 - 2025 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-02 ISSUE - 92 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 3 SATURDAY MAY 2025 PAGES : 8 Rs :2-00

### 'అమరావతి'కి సహకరిస్తాం..

## ఏపీ కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలు: మోదీ




.అమరావతి: అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. "దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది" అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు.

**చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు..**

"టెక్నాలజీ నాతో మొదలైనట్లు చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగు తుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు అందిస్తుంది" అన్నారు.

**పవన్ జీ.. ఇది మనమే చేయాలి..**

"ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్ల సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ .60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణా లు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయా లకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నా" అన్నారు. "ఇంద్రలోకం రాజధాని అమరావతి.

### మూడేళ్ల తర్వాత అమరావతి సిటీ ప్రారంభోత్సవానికి...

## ప్రధాని మోదీ మళ్లీ రావాలి: చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో అమరావతిని ప్రపంచం గర్వించేలా నిర్మిస్తామని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 93 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రాత్మక విజయం సాధించిందని చంద్రబాబు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉందని, ప్రధాని మోదీ అండతో దానిని తిరిగి గాడిలో పెడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తీసుకొస్తున్నామని అన్నారు.అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల సెంటిమెంట్ అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణం కోసం నాడు 29 వేల మంది రైతులు తమ భవిష్యత్తును త్యాగం చేసి 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారని గుర్తుచేశారు. చారిత్రకంగా అమరలింగేశ్వర స్వామి, కృష్ణానది, బౌద్ధారామాలకు నిలయమైన అమరావతి అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చెప్పలేని కష్టనష్టాలు అనుభవించారని, వారి పోరాటం, త్యాగం మరువలేనిదని అన్నారు. అమరావతి ఉద్యమం లాంటి దాన్ని తన జీవితంలో చూడలేదని కొనియాడారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో అమరావతికి మళ్లీ ప్రాణం పోశారని వ్యాఖ్యానించారు.ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పునర్ నిర్మాణ పనులను ప్రారంభించుకోవడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజని చంద్రబాబు అభివర్ణించారు. ఐదు కోట్ల మంది ప్రజలు గర్వంగా 'ఇది మా రాజధాని' అని చెప్పుకునేలా అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు కేంద్రంగా, ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలతో అనుసంధానమై ఉండేలా, గ్రీన్ ఎనర్జీతో కాలుష్య రహిత నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తామని వివరించారు. అమరావతిలో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు చదువుకునేలా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు.గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని స్థాపించి ఐటీ విప్లవానికి నాంది పలికామని, దానిని నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఏఐ (కృత్రిమ మేధ) రంగంలోనూ ఏపీ దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మూడేళ్ల తర్వాత అమరావతి నగరం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకున్నాక, మళ్లీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. అమరావతి అభివృద్ధికి మోదీ అందిస్తున్న సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశీస్సులు తమకు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కేవలం అమరావతే కాకుండా, రాష్ట్రంలోని అన్ని 26 జిల్లాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.ఇవాళ అమరావతికి వర్ష సూచన ఉందన్నారని, కానీ వర్షం రాకుండా దేవతలు మొత్తం ఆశీర్వదించారని చంద్రబాబు సంతోషంగా చెప్పారు. ప్రధాని మోదీ కూడా ఒక మాట అన్నారని, తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ సభ కూడా ప్రతికూల వాతావరణం కారణంగా రద్దవలేదని, ఇవాళ అమరావతి సభ కూడా సక్సెస్ అయి తీరుతుందని చెప్పారని చంద్రబాబు వివరించారు.

## దివిసీమ తుపానులా అమరావతిని వైకాపా తుడిచేసింది: పవన్



అమరావతి: అమరావతి రైతులు గత ఐదేళ్లుగా నలిగిపోయి.. లాఠీ దెబ్బలు తిన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతి పునఃనిర్మాణం సభలో ఆయన ప్రసంగించారు.గతంలో రైతులను కలిసినప్పుడు 'మా కన్నీళ్లు తుడిచేదెవరు' అని అడిగినట్లు గుర్తు చేసుకున్నారు. అమరావతి ఐదు కోట్ల మందికి సంబంధించిన హబ్ అని అభివర్ణించారు. దేశమే తన కుటుంబంగా మోదీ భావిస్తున్నారని కొనియాడారు. అమరావతి పునఃప్రారంభానికి విచ్చేసిన ఆయనకు చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు చెప్పారు."దివిసీమ తుపానులా గత ప్రభుత్వం అమరావతిని తుడిచేసింది. ధర్మయుద్ధంలో అమరావతి రైతులే విజయం సాధించారు. రాజధాని రైతుల పోరాటానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి రైతుల త్యాగాలను మరిచిపోలేం. వారి త్యాగాలకు జవాబుదారీగా ఉంటాం. రాజధాని నిర్మించి అమరావతి రైతుల రుణం తీర్చుకుంటాం. రైతులు భూములు ఇవ్వడం మాత్రమే కాదు.. రాష్ట్రానికి భవిష్యత్‌నిచ్చారు. అమరావతి ప్రపంచ స్థాయి సర్వశ్రేష్ఠ రాజధానిగా ఆవిర్భవిస్తుంది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉండటం వల్ల శరవేగంగా అభివృద్ధి జరుగుతుంది. భవిష్యత్తులో మన విద్యార్థులు బెంగళూరు, హైదరాబాద్ వలస వెళ్లరు. అందరం కోరుకున్నట్లే చంద్రబాబు సీఎం అయ్యారు. ఆయన పాలనా దక్షతతో అమరావతిని అద్భుత రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి రాష్ట్రానికే కాదు.. దేశానికే తలమానికంగా నిలుస్తుంది. అమరావతికి సహకరిస్తున్న మోదీకి ధన్యవాదాలు. భవానీ మాత మోదీని మరింత శక్తిమంతున్ని చేయాలి"అని పవన్ ఆకాంక్షించారు.గత వైకాపా హయాంలో అర్థాంతరంగా నిలిచిపోయిన అమరావతి పనులు నేడు రూ.వేల కోట్లతో పునః ప్రారంభమవుతున్నాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కలయికలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకెళ్తోందని చెప్పారు.

## మోడీ మిసైల్.. దెబ్బకు పాకిస్తాన్ మాయం..

### లోకేష్ ప్రశంసల జల్లు..!



అమరావతి: అమరావతి రాజధాని పునఃప్రారంభ సభలో మంత్రి నారా లోకేష్ ఇవాళ ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసల జల్లు కురిపించారు. ముఖ్యంగా పాకిస్తాన్ పై పోరుతో పాటు కుల గణన విషయంలో ప్రధాని మోడీ తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు. అలాగే అమరావతి రాజధానికి ప్రధాని అందిస్తున్న సహకారానికి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు.పాకిస్థాన్ గీత దాటిందని, అమాయకుల్ని చంపి చాలా పెద్ద తప్పు చేసిందని మంత్రి లోకేష్ తెలిపారు. ఒక్క పాకిస్థాన్ కాదు, వంద పాకిస్థాన్లు వచ్చినా భారతదేశం నేల పై మొలిచిన గడ్డి కూడా పీకలేరన్నారు. వంద పాకిస్తాన్లకు సమాధానం చెప్పే ఒక మిసైల్ మన దగ్గర ఉందన్నారు. ఆ మిసైల్ పేరు నరేంద్ర మోదీ అన్నారు. సింహం ముందు ఆటలు ఆడకూడదన్నారు. మన సింహం నమో కొట్టే దెబ్బకు వరల్డ్ మ్యాప్ లో పాకిస్థాన్ మిస్సింగ్ అని రావడం ఖాయమన్నారు.పాకిస్థాన్ ఆర్మీ లో పనిచేసే వారు సెలవు పెట్టి పారిపోతున్నారని, కొంత మంది రాజీనామా చేస్తున్నారని లోకేష్ తెలిపారు. దటీజ్ నరేంద్ర మోదీ అన్నారు. నమో కొట్టే దెబ్బకి పాకిస్థాన్ దిమ్మతిరగడం ఖాయమన్నారు. పాకిస్థాన్‌కు ధీటుగా సమాధానం ఇవ్వడానికి దేశం మొత్తం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అండగా నిలుస్తుందన్నారు. పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు దేశం అండగా ఉంటుందన్నారు.కేంద్రం కుల గణన చేయాలని తీసుకున్న నిర్ణయం ఒక సంచలనం అని లోకేష్ తెలిపారు. ఇతరులు దశాబ్దాలుగా సంకోచించిన ఒక కీలక అంశంపై మోడీ జీ ధైర్యంగా నిర్ణయం తీసుకుని చరిత్రను తిరిగి రాశారన్నారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించాలనే నిబద్ధతకు లోబడి మోడీ జీ సాహసో పేతమైన నిర్ణయం తీసుకున్నా రన్నారు. వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలకు ఈ నిర్ణయం పరిష్కారం చూపుతుందన్నారు.ఎన్ని కుట్రలు చేసినా జై అమరావతి నినాదాన్ని మాత్రం ఆపలేకపోయారని లోకేష్ తెలిపారు. ఆపడానికి, పీకడానికి అమరావతి ఎవరి ఇంట్లో పెంచుకున్న పెరటి మొక్క కాదన్నారు. జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని అన్నారు. అమరావతికి శంకుస్థాపన చేసింది మన ప్రధాని నమో అన్నారు. ఆయన శంకుస్థాపన చేసిన దానిని ఆపే దమ్ము ఎవడికీ లేదన్నారు. 1631 రోజులు పోరాడి అమరావతిని సాధించుకున్న రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ గారి చేతుల మీదుగా అమరావతి పనులు తిరిగి ప్రారంభం అవుతున్నాయని, ఇక మనకు తిరుగులేదని లోకేష్ తెలిపారు అమరావతి అన్స్టాపబుల్. అభివృద్ధి వికేంద్రీకరణ జెట్ స్పీడ్ తో జరగబోతుందన్నారు. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్, భోగాపురం ఎయిర్పోర్ట్, ప్రకాశం జిల్లా లో సిబిజి ప్లాంట్స్ ...ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కి అన్ని రకాలుగా ప్రధాని నరేంద్ర మోదీ సహకారం అందిస్తున్నారన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీజీకి ఆంధ్రప్రదేశ్ అన్నా, అమరావతి అన్నా ఎంతో ప్రేమని లోకేష్ తెలిపారు. ఇప్పుడు ఆయన ఢిల్లీ లో ఎంత బిజీగా ఉన్నారో మన అందరికీ తెలుసని, అయినా ఈ కార్యక్రమానికి వచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయేకి 94 శాతం సీట్లు ఇచ్చారని, ప్రధాని నరేంద్ర మోదీజీ ఆంధ్రప్రదేశ్ కోరిన ప్రతి కోరికను తీరుస్తు న్నారని తెలిపారు. గతంలో విశాఖపట్నం వచ్చి రైల్వే జోన్, ఎన్టీపీసి గ్రీన్, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ కు శంకుస్థాపన చేసారని, విశాఖ ఉక్కును కాపాడారని గుర్తుచేశారు. ఇప్పుడు అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు తిరిగి ప్రారంభిస్తున్నారన్నారు.

## తరతరాలు గర్వపడేలా అమరావతిని నిర్మిస్తాం: మంత్రి నారాయణ



అమరావతి: ఏపీ కలల రాజధాని అమరావతిని తరతరాలు గర్వపడేలా నిర్మిస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సభలో ఆయన ప్రసంగించారు. "పదేళ్ల క్రితం ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పురుడు పోసుకుంది.పునఃప్రారంభం కూడా ఆయన చేతుల మీదుగా జరగడం మన అదృష్టం. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో 29 గ్రామాల్లో 29,373మంది రైతులు కేవలం 58 రోజుల్లోనే ఒక్క సమస్య కూడా లేకుండా 34వేల ఎకరాల భూమిని అమరావతి కోసం త్యాగం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. అమరావతి రైతుల త్యాగం వెలకట్టలేనిది. అమరావతి కోసం ఎన్నో త్యాగాలు చేసిన రైతులకు నా పాదాభివందనం" అన్నారు."ప్రపంచంలోనే టాప్ 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలనే లక్ష్యంతో 2014-19లోనే రూ.40వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. దాదాపు రూ.9వేల కోట్ల పనులు పూర్తి చేశాం. గత ప్రభుత్వం నిర్వాకంతో గత ఐదేళ్లలో రాజధాని పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వస్తే అమరావతిని పూర్తి చేస్తామని కూటమి తరఫున ఎన్నికల ముందు చెప్పాం. ప్రధాని ఆశీస్సులతో సీఎం చంద్రబాబు సారథ్యంలో మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటాం" అని మంత్రి నారాయణ అన్నారు.

# ఆనందం అన్వేషణ ద్వారానే సాధ్యం....



కాకినాడ (రాయల్ జర్నలిజం) మనిషిలో ఉన్న ఆనందాన్ని అన్వేషణ కొరకు ఇంద్రియాల ద్వారా తెలుసుకో%శీ%డి అని శ్రీ కృష్ణాన%శీ%ద అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్విక బాల వికాస వేసవి శిక్షణా శిబిరాన్ని ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాడెంట్ హుస్సేన్ షా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఉన్నతమైన భారతీయ సంస్కృతి లో తల్లి మొదటి గురువు, విద్య నేర్పే ఆచార్యుడు రెండవ గురువు.కావున వారిని గౌరవించాలని హుస్సేన్ షా అన్నారు. తాత్విక బాల వికాస ప్రధాన కన్వీనర్ ఏ. వి.వి సత్యనారాయణ మాట్లాడుతూ శుక్రవారం నుండి 9 వ తేదీ వరకు వివిధ రంగాల్లో నిష్ణాతులైన పండితులు ఈ 8 రోజులు పిల్లలకు శిక్షణ ఇస్తారు. క్రమశిక్షణ తో వేసవి శిక్షణా శిబిరం లో పాల్గొని మీ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ అద్వైత ఆశ్రమం వేదాంత ఆచార్య స్వామి, కృష్ణాన%శీ%ద ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కృష్ణాన%శీ%ద మాట్లాడుతూ విద్యార్థులు అనంతమైన విద్యానిధి కి వారసులు అని అన్నారు. పుట్టినది మొదలు చనిపోయే వరకూ నేర్చుకొనేవాడే యదార్థమైన నిత్య విద్యార్థి అని అన్నారు. పీఠధిపతి డా. ఉమర్ అలీషా ఆన్ లైన్ ద్వారా అనుగ్రహ భాషణ, సుభాశీస్సులు ప్రసాదించారు. ఆహ్లాదకరమైన, దివ్య శక్తి గల మన నూతన ఆశ్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఏ. వి. వి సత్యనారాయణ సారథ్యంలో పిల్లలు విద్యలో లో రాణించుటయే కాక, నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆశీర్వాదం చేశారు. ఈ కార్యక్రమంలో యోగ భారత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జ్యోతుల నాగేశ్వరావు యోగా విశిష్టత, అష్టాంగ యోగం ప్రాముఖ్యత, ధ్యానం ప్రాముఖ్యత వివరించారు ఈ కార్యక్రమంలో హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ కె. వి. ఎస్. ఎస్ ప్రసాద్ , పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్. టి. వి ప్రసాద వర్మ వేదికపై ఆశీనులై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గీతావధాని యర్ర%శీ%శెట్టి ఉమా మహేశ్వర రావు సమన్వయ కర్త గా వ్యవహరించారు

# ప్రధాని మోదీ సభకు భారీగా తరలి వెళ్లిన సిటీ టిడిపి శ్రేణులు...



కాకినాడ (రాయల్ జర్నలిజం) ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి పున: ప్రారంభోత్సవ నిర్మాణ పనులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు చేతులు మీదుగా ప్రారంభించడం ఆంధ్ర రాష్ట్ర చరిత్రకు ఒక మేలిమి మలుపు కానుందని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమాడి మోహన్ వర్మ పేర్కొన్నారు.ఆంధ్ర రాష్ట్ర రాజధాని అమరావతి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో కాకినాడ నగరం నుండి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, మోహన్ వర్మ కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంగణం నందు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి పునర్మాణ పనులకు, 49 వేలకోట్లతో చేపట్టు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాన మంత్రివర్యులు శ్రీనా నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించడం సుబదాయకమని, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు అమరావతి అనే రాజధాని ఉందని ప్రతి ఆంధ్రుడు గర్వంగా తలెత్తుకునేలా ముఖ్యమంత్రివర్యులు విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు గారి సారిధ్యంలో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని, గత పాలకులు రాజధాని నిర్మాణ పనులకు అడుగడుగునా అడ్డంకులు ఎదురైనా చివరకు అమరావతి ప్రాంత ప్రజలు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రమేష్, పెనుపోతు రాము, ఎరుపెల్లి రాము, పినపోతు జీవరత్నం, సీకోటి అప్పలకొండ, పాంగా బుజ్జి, మూగు రాజు, అంబటి చిన్న, గొరుసు దుర్గారావు, చొడుపిల్లి సతీష్, చింతపల్లి తాతారావు, కోడూరు కుమారస్వామి, లూటుకుర్తి మోహన్, అమలకంటి బలరాం, పాలిక నాని, సంఘాని నాగూర్, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, ఓలేటి పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదములు తెలిపిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి మహా నగర నిర్మాణ పనులను పునః ప్రారంభించేందుకు విచ్చేసిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి సభా ప్రాంగణం వద్ద స్వాగతం పలికిన అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాని మోడీకి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ను పరిచయం చేశారు. ఈ సందర్భంగా నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్రానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేస్తున్న శుభ సందర్భంగా ఆయనకు, సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ధన్యవాదములు తెలిపారు.

# విధ్వంసం నుండి వికాసం వైపు అమరావతి

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ మే 02 (రాయల్ జర్నలిజం) అమరావతిని విధ్వంసం నుండి వికాసం వైపు నడిపించేందుకు, అమరావతి పునః నిర్మాణం పనులు ప్రారంభించనున్న భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నందిగామ నియోజకవర్గ నుండి కూటమి నాయకులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. నియోజకవర్గంలో ప్రధాని మోడీ సభకు ప్రజలతో బయలుదేరిన బస్సులను పలుచోట్ల జెండాలు ఊపి బస్సులను ప్రారంభించారు.ప్రధాని మోడీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం కావడం శుభసూచకమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హర్షం వ్యక్తం చేశారు.ఇంత గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యే అవకాశం రావడం సంతోషకరమన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అమరావతి అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు.

# మెడికల్ వార్డుల్లో రోగుల రద్దీకి అనుగుణంగా మంచాలు ఏర్పాటు...

## అదనంగా జెరియాట్రిక్, హెమటాలజీ సేవలు: జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్...



కాకినాడ((రాయల్ జర్నలిజం)కాకినాడ ప్రభుత్వ సామాన్య సర్వజన ఆసుపత్రిలో అత్యంత ప్రధానమైన ప్రాముఖ్యత కలిగిన విభాగాల్లో ఒకటైన మెడికల్ వార్డులో రోగుల కష్టాలు గట్టేక్కనున్నాయి. ఆసుపత్రి సూపరింటేండెంట్ డాక్టర్ ఎమ్.పి.ఆర్ విఠల్ చొరవతో దాతలనుండి సేకరించిన మంచాలు, ఆసుపత్రిలో రోగుల సంఖ్య తక్కువగా ఉన్న వార్డుల్లో నుండి తీసుకువచ్చిన మంచాలను మెడికల్ వార్డులో ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ విఠల్ తెలిపారు. ఇప్పటి వరకు రోగుల తాకిడి అధికంగా ఉండడంతో మంచానికి ఇద్దరూ లేక ముగ్గుర్ని వేసి వైద్యసేవలు అందిస్తూ వైద్యులు నెట్టుకొచ్చారు.శుక్రవారం సూపరింటేండెంట్ రౌండ్స్ నేపథ్యంలో జనరల్ మెడిసిన్ వార్డులు, ఓల్డ్ ఎస్.ఎస్.ఎల్.ఆర్ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ మెడికల్ వార్డుల్లో మంచాలు సమస్య అధికంగా ఉన్న కారణం మరికొన్ని మంచాలు ఇక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. డి ఎమ్ ఈ ఆదేశాల మేరకు మెడికల్ అన్ని యూనిట్లకు సంబంధించి వరండాల్లో వయోవృద్ధుల కు ప్రత్యేక జెరియాట్రిక్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మెడికల్ విభాగం పర్యవేక్షణలో కొనసాగే రక్తసంబందిత హెమటాలజీ విభాగానికి కూడా మంచాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇందుకు సంబంధించి మెడికల్ విభాగాదిపతి డాక్టర్ పి. యశోదమ్మ అభిప్రాయాలు సూచనలు చర్చించడం జరిగిందని ఆయన అన్నారు. క్రమబద్ధంగా ప్రాధాన్యతానుసారం ఆసుపత్రిలో మౌళిక సౌకర్యాలు కల్పించి రోగులకు మేలైన మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా, రోజు రోజుకు పెరుగుతున్న రోగుల రద్దీకి అనుగుణంగా వైద్య సేవలు అందించెందుకు సమిష్టి కృషి చేస్తున్నట్లు జిజిహెచ్ సుపరింటేండెంట్ డాక్టర్ ఎమ్.పి.ఆర్ విఠల్ పేర్కొన్నారు.

# అమరావతి ప్రజా రాజధాని....కోగంటి బాబు




**కంచికచర్ల మే 02** (రాయల్ జర్నలిజం) అమరావతి ప్రజా రాజధాని అని ఎంపీటీసీ సభ్యులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోగంటి బాబు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నందుఅమరావతి ప్రజా రాజధాని పున: ప్రారంభం సభకుబస్సులలో వెళుతున్న ప్రజలకు కూటమి నాయకులతో కలిసి కోగంటి బాబు జండా ఊపి బస్సులను ప్రారంభించారు. అమరావతి సభకు బస్సులను ఏర్పాటు, చేసి బస్సులో ప్రయాణం చేసే ప్రజలకు అన్నీ సదుపాయాలు ఏర్పాటు ఏర్పాటు చేశారు.రాష్ట్ర భవిష్యత్తు కోసం భావి తరాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఈ రాజధాని నిర్మాణం జరుగుతోంధని, కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రజా రాజధానిలో అందరూ పాలు పంచుకోవాలని కోగంటి బాబు అన్నారు...

# రాపూరు సివిల్ సప్లయి స్ గోడౌన్ పై మాజీ లారీ ట్రాన్స్ పోర్టర్ కన్నెర్ర

## కూలీలను అన్ లోడింగ్ రానివ్వకుండా మోకాలడు

**నెల్లూరు - అమరావతి , మే 02**(రాయల్ జర్నలిజం)



వాహనాలు సకాలం లో పెట్టడం లేదని నెల్లూరు జిల్లా రాపూరు సివిల్ సప్లయిస్ గోడౌన్ డి టి, డి ఎం దృష్టికి తీసుకు వెళ్లడంతో డి ఎం ఆదేశాలతో కొత్త లారీ ట్రాన్స్ ట్రాన్స్ పోర్టర్ మారటం తో పాత ట్రాన్స్ పోర్టర్ గోడౌన్ పై కన్నెర్ర చేశారు. దీంతో చక చక అక్కడ గందర గోళమే జరిగి పోయింది.గతం లో గోడౌన్ లో ఏమి జరుగుతుందో కొత్త గా గోడౌన్ డి టి గా వచ్చిన వారికి తెలియక పోవటం తో వారు తలలు పట్టు కోవాల్సిన పరిస్థితి. రాజకీయంగా బలవంతులు గా మాజీ లారీ ట్రాన్స్ పోర్టర్ వుండటం తన ఈ గో చూపిస్తున్నారనీ గుస గుస లు వ్యక్తం అవుతున్నాయి. డీలర్ లకు లారీ చేరే లోపు ప్రతి నెల ఒక్కో లారీ లోడ్ మూడు నుంచి నాలుగు బస్తాల బియ్యం లాస్ ను డీలర్ లు ఎదుర్కొంటున్నారు.ప్రతి నెలా ఇదే పరిస్థితి ఎదురవుతుందని ఏమి మాట్లాడ లేక ఇబ్బంది పడుతున్నామని డీలర్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లారీ డ్రైవర్ లు కూడా ఒక్కో బియ్యం బస్తా ను మధ్య లో అమ్మేస్తూ లోడ్ చేసే వాళ్ళు తగ్గించారని తప్పించుకుంటున్న పరిస్థితి.ఒక్కో లారీ కి ఒక ప్రభుత్వ ఉద్యోగిని లారీ వెంట పంపేలా సివిల్ సప్లయిస్ అధికారులు దృష్టి పెట్టాలని డీలర్ లు కోరుతున్నారు.డీలర్ లకు తూకాలు అడిగితే చినిగిన గోనె సంచులు చెత్త బియ్యమే డీలర్ లు ముఖాన కొడుతున్నారని విమర్శలు వున్నాయి.ఎక్కడా లేని విధంగా రాపూరు సివిల్ సప్లయిస్ గోడౌన్ లో చిత్ర విచిత్ర పరిస్థితిని డీలర్లు అనుభవించక తప్పడం లేదని తెలుస్తోంది. ఈ గోడౌన్ మద్దెల మడుగు నివాసాలకు 1కిలో మీటరు దూరంగా వెంకటగిరి డబుల్ రోడ్డు మార్గం లో ఉండటం ఇటు డీలర్లు యిబ్బంది పడుతున్నారు. రాపూరు మద్దెల మడుగు ప్రాంతం లో ప్రజల నివాసాల మధ్య ఉంటే గోడౌన్ లో ఏమి జరిగినా తెలుస్తూ ఉంటుందని విసిరేసినట్లు వ్యవసాయ మార్కెటింగ్ గోడౌన్ లో సివిల్ సప్లయిస్ గోడౌన్ ఉండటం డీలర్ లకు కష్టంగా ఉంది. డీలర్ ల కు తుకాలు తో రేషన్ సరుకులు ఇవ్వాలని డీలర్ లు గగ్గోలు పెట్టడం అధికారులు మాత్రం పట్టించుకున్న పరిస్థితులు లేకుండా పోయాయి.సైదాపురం మండలానికి గ్రామాలకు దగ్గర లో ఉన్న పాదలకూరు సివిల్ సప్లయిస్ గోడౌన్ నుండి సైదాపురం మండలం లోని తుమ్మల తలుపూరు,కలిచేడు, దేవరవేమూరు ,గిద్దలూరు,ఊటుకూరు, పెరుమాళ్ళపాడు, అదురుపల్లి గ్రామాల షాపులకు సప్లయి చేసే విధంగా చర్యలు తీసుకుంటే ఒకే బస్సులో వెళ్లి గోడౌన్ కి వెళ్ళి స్టాక్ తెచ్చు కోవటానికి అనుకూలంగా ఉంటుందని గోడౌన్ మార్చాలని ఆయా గ్రామాల డీలర్లు కోరుతున్నారు.

# నల్లమల అడవుల్లో కలకలం.. అటవీ డివిజన్‌లో పెద్దపులి అనుమానాస్పద మృతి..!

అమరావతి : నల్లమల అడవుల్లోకి పెద్దపులిలో వేటగాళ్లు చొరబడ్డారా? పులులు చిరుతలకు ప్రమాదం పొంచి ఉందా? నల్లమల అడవుల్లో పెద్దపులి మృతి చెందడానికి కారణం ఏంటి? అటవీశాఖ అధికారులు ధ్రువీకరించడంలో 20 రోజుల సమయం ఎందుకు తీసుకున్నారు? పెద్దపులి మృతికి కారణాలు ఏంటి?ఆత్మకూరు అటవీ డివిజన్ లో పెద్దపులి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.కొత్తపల్లి మండలం, గుమ్మడాపురం బీట్ లోని గంగిరేవు చెరువు సమీపంలో పెద్దపులి కళేబరాన్ని ఫారెస్ట్ సిబ్బంది గుర్తించారు.వెంటనే సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ ఉన్నతాధికారులు పులి మృతి విచారణ చేస్తున్నారు. అయితే పులి మృతి చెంది సుమారు ఇరవై రోజులు అయివుండొచ్చని ఫారెస్ట్ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.పులి శరీరం మొత్తం ఎండిపోయి ఎముకల గూడు లాగా కనపడుతున్నాడంతో, అనారోగ్యం కారణంగా చనిపోయిందని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు ఆత్మకూరు రేంజర్ పట్టాభి తెలియజేశారు. ఈ పెద్ద పులి ఏ విధంగా మృతి చెందింది అనారోగ్యం కారణంగా లేక వేటగాళ్ల ఉచ్చుకు బలైందా అనే కోనంలో అటవీశాఖ అదికారులు దర్యాప్తు చేస్తున్నారు. పెద్దపులి మృతి చెందిన 20 రోజుల తర్వాత అధికారులు అధికారికంగా ధ్రువీకరించడం చర్చనీయాంశమైంది.



## అక్కడ చెరువు గట్టుపై అమ్మవారి మట్టి బొమ్మని చేసి ఘనంగా పూజలు చేసే రైతులు.. ఎందుకంటే



ఏలూరు: వినాయక చవితి పండుగ రోజు చాలా మంది మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తారు. కొందరు స్వయంగా బంకమన్ను తీసుకుని వచ్చి వినాయకుని ప్రతిమను తయారు చేస్తారు. అసలు వినాయకుడు ఎలా జన్మించాడు అంటే పార్వతీదేవి తన శరీరానికి రాసుకున్న పసుపు ముద్దుతో గణేషుడి ని సృష్టించి ప్రాణం పోసింది. ఆయన పుట్టిన రోజు ను యావత్ భారత దేశం ప్రజలు వినాయక చతుర్థి, గణేష్ చతుర్థి అని పిలుచుకుంటారు. ఇంకా పూజ, వ్రతం సమయంలో గౌరీదేవి పూజ చేయటం మనకు తెలిసింది. తమలపాకులో పసుపు ఉంచి దాన్ని జాగ్రత్తగా తడుపుతూ ముద్దగా చేసి బొట్టు పెట్టి, పూలతో అలంకరించి పూజ చేస్తాము. అయితే కొల్లేరు లో చేతికొచ్చిన పంట కోసే ముందు ఏమి చేస్తారో తెలుసా. గట్టుపై పెద్దింట్లమ్మను మట్టితో తయారు చేస్తారు. ఆ విగ్రహానికి పూజలు చేసి పొంగలు వండి, కోడిని కోసుకుని అందరూ కోతలకు సిద్ధమవుతారు. అక్కడే భోజనాలు చేయటం కొల్లేరు ప్రాంతంలో ఆనవాయతీ గా వస్తుంది.

ఎవరీ కొల్లేరు పెద్దింట్లమ్మ తల్లి

కొల్లేరు ప్రాంతంలో ని కైకలూరు నియోజకవర్గంలో కొల్లేటి కోట గ్రామంలో పెద్దింట్లమ్మ తల్లి ఆలయం ఉంది. కొల్లేరు ప్రాంతం ప్రజలు ఆమెను తమ ఇలవేల్పుగా కొలుస్తారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు దూరం ప్రాంతాల నుంచి నిత్యం అమ్మవారిని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకుంటారు. కొల్లేటి కోట చూట్టూ నీరు ఉంటుంది. ద్వీపకల్పంలా ఉంటుంది. ఆలయంలో అమ్మవారు పద్మాసనం లో కూర్చుని ఉంటారు. ప్రతియేటా జాతర ఘనంగా జరుగుతుంటుంది. కొల్లేరు ప్రజలు ప్రభలు కట్టి, బోనాలు తో వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు. వేంగి రాజులు కాలంలోనే ఆలయం నిర్మించారని చెబుతారు. ఇక్కడ దీనికి సంబంధించిన పలు శాసనాలు, ఆనవాళ్లు లభించాయి.

## ధాన్యం కొనుగోలు చేయాలని కైకరంలో రైతులు ధర్నా..



**ఉంగుటూరు/కైకరం(మే 2) :** ధాన్యం కొనుగోలు టార్గెట్స్ పెంచాలి.. రైతులకు గోనె సంచులు ఇవ్వాలి అంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం కైకరం వంతెన వద్ద రైతులు,కౌలు రైతులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి ధాన్యం కొనుగోలు టార్గెట్స్ పేరుతో అన్నదాతలను ఇబ్బందులు గురి చేయడం తగదని అన్నారు. టార్గెట్స్ పూర్తయ్యాయని రైతులకు గోనె సంచులు ఇవ్వడం లేదని, రవాణా సౌకర్యం కల్పించడం లేదని చెప్పారు. కోసిన ధాన్యం ఆరుదలకు రావడంతో ఏమి చేయాలో అర్థం కాక కౌలు రైతులు దిక్కు తోచని స్థితిలో అల్లాడుతున్నారని చెప్పారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం కుదించడం వలన చివరి దశలో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలసూత్రం కన్నారావు, నక్కా వెంకట్రావు, కె. రామారావు, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భర్త అమితమైన ప్రేమతో భార్య పేరు పచ్చబొట్టు పొడిపించుకుంటే.. ఆమె అక్రమ సంబంధం మోజులో

అమరావతి : తెనాలికి చెందిన పృథ్వీరాజ్ (27), దూరపు బంధువైన వెంకటలక్ష్మిని ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వెంకట లక్ష్మీకి ఇది రెండో వివాహం.. కొద్ది కాలంపాటు దంపతులు తెనాలిలోనే ఇద్దరూ కలిసి జీవించారు. అయితే ఇక్కడ ఉపాధి దొరక్కపోవడంతో భార్యను తీసుకొని పృథ్వీరాజ్ బెంగుళూరు వెళ్లాడు. అక్కడ తాపి మేస్త్రీగా పనిచేశాడు. అక్కడ వీరికి పల్నాడు జిల్లా వెల్లటూరుకు చెందిన కోటేశ్వరరావు (23) పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో కోటేశ్వరావుతో వెంకటలక్ష్మికి వివాహేతర సంబంధం ఏర్పడింది. అన్నా, చెల్లి అంటూ పిలుచుకుంటూ తమ ప్రవర్తనపై పృథ్వీరాజ్‌కు అనుమానం రాకుండా ఇరువురు జాగ్రత్త పడ్డారు. చివరకు వారి వ్యవహారం తెలియడంతో.. అక్కడ ఉండటం ఇష్టం లేని పృథ్వీరాజ్ తన భార్యను తీసుకొని తెనాలి వచ్చేశాడు.తెనాలిలో ఉంటున్న సమయంలోనే కోటేశ్వరావుతో వెంకట లక్ష్మీ ఫోన్‌లో మాట్లాడుతుండేది. ఈ క్రమంలోనే వెంకటలక్ష్మి, కోటేశ్వరావు మధ్య ఉన్న వివాహేతర సంబంధం గురించి పృథ్వీరాజ్ తండ్రి అంకమ రావుకు తెలిసిపోయింది. దీంతో ఇంట్లో ఘర్షణ జరిగి వెంకటలక్ష్మి బెంగుళూరు వెళ్లిపోయింది. అక్కడి నుంచి కోటేశ్వరరావుతో కలిసి నాలుగు నెలల కిందట వెల్లటూరు చేరింది. అక్కడ మూడు నెలల సహజీవనం తర్వాత కోటేశ్వరరావు మద్యం తాగి వచ్చి కొడుతూ ఉండడంతో.. భర్తకు ఫోన్ చేసి తాను మారిపోయానని తిరిగి తెనాలి వచ్చేస్తానని వేడుకుంది. దీంతో పృథ్వీరాజ్ ఆమెను తన ఇంటికి రానిచ్చాడు. కొద్దికాలం పాటు సక్రమంగా ఉన్న వెంకటలక్ష్మి తిరిగి కోటేశ్వరావుతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ వచ్చింది.అయితే కోటేశ్వరావు తెనాలి వచ్చి వెంకటలక్ష్మీని కలవడం సమస్యగా మారింది. దీంతో కోటేశ్వరావు పృథ్వీరాజ్‌పై కక్ష పెంచుకున్నాడు. అడ్డుతొలగించుకోవాలని చూశాడు. ఈ విషయం తెలియని పృథ్వీరాజ్ అప్పుడప్పుడు కోటేశ్వరావుతో ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేవాడు. గత నెలలో తెనాలి వచ్చిన కోటేశ్వరావు పృథ్వీరాజ్ కు ఫోన్ చేసి మద్యం సేవిద్దామని పిలిచాడు. కోటేశ్వరావు మాట మాటలు నమ్మిన పృథ్వీరాజ్ అతనితో కలిసి మద్యం తాగేందుకు వెళ్లాడు. అయితే పక్కా ప్లాన్ తో వచ్చిన కోటేశ్వరావు మరో ఇద్దరి సాయంతో పృథ్వీరాజ్ పై దాడి చేసి చంపేశాడు. అయితే మద్యం కొనుగోలు చేసే సమయంలో స్థానికుడు వీరిని గుర్తించి.. పృథ్వీరాజ్ తండ్రికి అంకమరావు విషయం తెలియజేశాడు. దీంతో అంకమరావు తన కొడుకును చంపిన విషయంతో కోడలు ప్రమేయం ఉండి ఉంటుందన్న అనుమాన్ని వ్యక్తం చేశాడు.రంగంలోకి దిగిన పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి కోటేశ్వరావు, వెంకటలక్ష్మీతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టు ముందుంచారు. భార్యపై ఎంతో ప్రేమను కలిగి ఉన్న పృథ్వీరాజ్ ఆమె పేరును పచ్చబొట్టు పొడిపించుకున్నాడు. చివరకు ఆమె వల్ల ఇలా ప్రాణాలు కోల్పోయాడని పోలీసులు తెలిపారు.



## ఢిల్లీకి రేవంత్ రెడ్డి.. ఆ భేటీలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా తెలంగాణ సీఎం!



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు(శుక్రవారం) సాయంత్రం ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరవుతారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఢిల్లీలో జరిగే మొట్టమొదటి సీడబ్ల్యూసీ సమావేశం కాబట్టి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు ప్రస్తావించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా జన గణనతో పాటు కుల గణన కూడా చేయాలని కేంద్ర మంత్రివర్గ నిర్ణయం, పహల్గామ్ ఘటనపై ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఈ రోజు సాయంత్రం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాక విభాగమైన సీడబ్ల్యూసీ సమావేశంలో రేవంత్ పాల్గొంటారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఢిల్లీలో నిర్వహించే తొలి సీడబ్ల్యూసీ సమావేశం ఇది. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై జాతీయ నాయకత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి సమగ్రంగా వివరిస్తారని తెలుస్తోంది.కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ.. ఎప్పటి నుంచో కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నారు. కుల గణననే ప్రధాన అస్త్రంగా ఆయన తన రాజకీయ కార్యకలాపాలు నడిపారు. అయితే కేంద్రం మాత్రం కులగణన పట్ల సుముఖత వ్యక్తం చేయలేదు. కానీ అనూహ్యంగా కేంద్రం తన వైఖరిని మార్చుకుంది. 2011 తర్వాత 2021లో జనగణన చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా నిర్వహించలేదు. కాబట్టి జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టాలన్న కేంద్రం నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీ దగ్గర ఉన్న ఏకైక అస్త్రం కూడా లేకుండా పోయింది.ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కుల గణనతోపాటు పహల్గామ్ ఉగ్ర దాడి, బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంపై తమ పార్టీ వైఖరిని ఈ సమావేశంలో ఖరారు చేయనున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన విజయవంతం కావడమే కాకుండా దేశానికి ఆదర్శంగా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్నారు. ఇదే విషయాన్ని సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన ప్రస్తావించనున్నారు. తమని కేంద్రం సంప్రదిస్తే సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.పహల్గామ్ ఉగ్ర దాడితో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ఉగ్ర దాడి జరిగిందని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆరోపిస్తోంది. అంతేకాకుండా పాకిస్తాన్‌పై గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. పహల్గామ్ ఘటనను పక్కదోవ పట్టించడం కోసమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన డిమాండ్‌గైన కుల గణనను బీజేపీ తెరపైకి తెచ్చిందని కాంగ్రెస్ పార్టీ అనుమానిస్తోంది.దేశవ్యాప్తంగా ఎక్కువగా డిమాండ్ ఉన్న బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఈ సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించనున్నారు. ఎప్పటి నుంచో బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా ఉన్న 50శాతం రిజర్వేషన్ల పరిమితిని రద్దు చేసి, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. బీసీ అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలు సందర్భాల్లో చెప్పారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్తోంది.

## ఆఫీస్ స్పేస్ కావాలా..? అయితే హైదరాబాద్‌కు వచ్చేయండి.. ఖాళీగా కార్యాలయ స్థలాలు..

హైదరాబాద్ : నగరంలోని కార్యాలయ స్థలాల మార్కెట్ గత కొంతకాలంగా ఊహించని మందగమనాన్ని చవిచూస్తోంది. ఒకప్పుడు దేశంలోని ఇతర ప్రధాన నగరాల కంటే అధిక వృద్ధిని కనబరిచిన ఈ నగరం.. ఇప్పుడు కార్యాలయ స్థలాలకు డిమాండ్ లేక వెలవెలబోతోంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన 2025 మొదటి క్వార్టర్ గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం వరకు హైదరాబాద్‌లో కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిన కార్పొరేట్ సంస్థలు ఇప్పుడు పెద్దగా ఉత్సాహం చూపడం లేదు.వెస్టియన్ సర్వే ప్రకారం.. దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో అత్యధికంగా ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. నగరంలో మొత్తం 1620 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలం అందుబాటులో ఉండగా.. అందులో ఏకంగా 284 లక్షల చదరపు అడుగులు ఎటువంటి అద్దెదారుల్లేకుండా ఖాళీగా ఉన్నాయి. ఇది మొత్తం అందుబాటులో ఉన్న స్థలంలో 17.5 శాతానికి సమానం. కార్పొరేట్ సంస్థలు అద్దెకు తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపకపోవడమే దీనికి ప్రధాన కారణమని వెస్టియన్ పేర్కొంది. గతంలో హైదరాబాద్ కార్యాలయ స్థలాల లీజింగ్‌లో ఎల్లప్పుడూ ముందుండేది. అయితే.. ప్రస్తుత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.ఇప్పటికే అందుబాటులో ఉన్న కార్యాలయ స్థలాలకే డిమాండ్ లేకపోవడంతో.. నూతన నిర్మాణ ప్రాజెక్టులు దాదాపుగా నిలిచిపోయాయి. రియల్టర్లు , కార్యాలయ స్థలాల నిర్మాణ సంస్థలు కొత్త ప్రాజెక్టుల జోలికి వెళ్లడం లేదు. దీని ప్రభావం సిమెంట్, ఉక్కు, ఇతర నిర్మాణ అనుబంధ పరిశ్రమలపై తీవ్రంగా పడింది. ఈ రంగాలపై ఆధారపడిన వ్యాపారులు, ఉద్యోగులు , కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి.. గతంలో హైదరాబాద్‌లో ఖాళీ స్థలాల శాతం 19 శాతంగా ఉండేది.అయితే కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఆ శాతం కొద్దిగా తగ్గింది. వెస్టియన్ హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, పూణే నగరాల్లో కూడా ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో హైదరాబాద్ తర్వాత అత్యధికంగా ఖాళీ కార్యాలయ స్థలాలు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నట్లు తేలింది. బెంగళూరులో అత్యధికంగా కార్యాలయ స్థలం (2805 లక్షల చదరపు అడుగులు) అందుబాటులో ఉండగా.. హైదరాబాద్ (1620 లక్షల చదరపు అడుగులు) తర్వాతి స్థానంలో ఉంది.ఒకప్పుడు కార్యాలయ స్థలాల డిమాండ్ , సరఫరాలో దూసుకుపోయిన హైదరాబాద్ ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో సరఫరా కూడా ఆగిపోయే పరిస్థితికి చేరుకుంది. అయితే.. దేశీయంగా ఈ ఏడాది జనవరి-మార్చిలో కార్యాలయ స్థలాల లీజింగ్ 34 శాతం పెరిగి 179.6 లక్షల చదరపు అడుగులకు చేరుకోవడం గమనార్హం. దీనికి ప్రధానంగా జీసీసీలు(గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్), ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక మరియు బీమా రంగాల నుండి అధిక డిమాండ్ కనిపించింది.

# ఏప్రిల్ నెలలో ఏసీబీ దూకుడు.. 30 రోజుల్లో 21 కేసులు నమోదు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. అవినీతి, అక్రమాస్తుల కేసుల నమోదులో సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఏప్రిల్ నెలలో అంటే కేవలం 30 రోజుల్లో మొత్తం 21 కేసుల నమోదు అయ్యాయి. 13 ఏసీబీ ట్రాప్ కేసులు, 2 అక్రమాస్తుల కేసులు, 2 క్రిమినల్ కేసులు, 2 తనిఖీ కేసులు, 2 సాధారణ కేసులు ఫైల్ చేసింది. మొత్తంగా 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్, రిమాండ్ చేయబడ్డారు. ఇక సుమారు 5లక్షల రూపాయల సొమ్మును సీజ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. అలాగే ఒక అధికారి ఇంట్లో సోదాలు చేసి 3.51 కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించినట్లు వెల్లడించారు.ఇటు మాజీ జుచీజ హరిరామ్ అక్రమాస్తులు మార్కెట్ వాల్యూ ప్రకారం 13.50 లక్షల ఆస్తులు గుర్తించాలని తెలిపారు. అలాగే మరికొన్ని కేసులను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064కు కాల్ చేయాలని ఏసీబీ అధికారులు మరోసారి విజ్ఞప్తి చేశారు. నెలలు మారినా అవినీతిపై తమ పోరాటం ఆగదన్నారు. మొత్తంగా అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా తన దూకుడు ఏప్రిల్ నెలకు మాత్రమే పరిమితం కాదంటున్నారు అధికారులు. ప్రజలు కూడా తమకు సహకరించాలని%ొ% ఒక్కరూపాయి లంచం అడిగినా వెంటనే తెలియజేయాలని కోరుతున్నారు.



# భారత్ - పాక్ యుద్ధం జరిగితే.. ఒక దేశం నాశనం..!

## ఆ దేశం ఏదో బాబా వంగా అప్పుడే చెప్పారా?



న్యూఢిల్లీ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత భారత్, పాక్ మధ్య సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇటీవలె భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నత సైనిక అధికారులతో సమావేశం నిర్వహించి, ఉగ్రవాదులను అంతం చేయడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. మోదీ ప్రకటనతో పాకిస్తాన్‌లో ఆందోళనలు పెరిగాయి. ఏ సమయంలో భారత్ దాడి చేస్తుందో అని పాక్ బిక్కు బిక్కు మంటూ ఉంది. ఈ నేపథ్యంలో ఒక వేళ నిజంగానే భారత్, పాక్ మధ్య యుద్ధం వస్తే.. ఏ దేశం గెలుస్తుంది, ఏ దేశం నాశనం అవుతుందనే విషయాన్ని ప్రపంచ ప్రసిద్ధి చెందిన బాబా వంగా అంచనా వేశారు.ఆమె బతికి ఉన్న సమయంలో చెప్పిన అనేక విషయాలు కాలక్రమంలో నిజం అవుతూ వచ్చాయి. 2025లో ఆమె చెప్పిన భూకంపాలు కూడా సంభవించాయి. దీంతో.. యుద్ధాల గురించి ఆమె చెప్పింది జరిగితీరుతుందని చాలా మంది విశ్వసిస్తున్నారు. 12 సంవత్సరాల వయసులో కంటి చూపు కోల్పోయిన బాబా వంగా 1911లో బల్గేరియాలో జన్మించి 1996లో మరణించారు. అయితే ఆమె అంచనాలు చాలా వరకు నిజమయ్యాయి. బాబా వంగా భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం లేదా పాకిస్తాన్ నాశనం గురించి ప్రత్యేకంగా అంచనా వేయలేదు. కానీ, ఇండియాతో యుద్ధం జరిగితే పాకిస్తాన్ పతనాన్ని ఆమె ముందే చెప్పిందనే విషయం సోషల్ మీడియాలో వ్యాప్తి అవుతోంది. కానీ, అది బాబా వంగా స్వయంగా చెప్పిందా? కాదా? అనేదానిపై క్లారిటీ లేదు.

**2025 గురించి బాబా వంగా అంచనాలు..**

ఇండియాతో యుద్ధంలో పాకిస్తాన్ భవితవ్యం గురించి బాబా వంగా చెప్పిన జోస్యం గురించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు చాలావరకు ఊహాజనితమైనవి. 2025 కోసం ఆమె చేసిన అంచనాలలో ఇండియా - పాకిస్తాన్ యుద్ధం లేదా పాకిస్తాన్ విధ్వంసం గురించి ప్రత్యక్ష ప్రస్తావన లేదు. 2025 సంవత్సరానికి బాబా వంగా చేసిన ప్రవచనాలు ఐరోపాలో ఒక పెద్ద సంఘర్షణ, మానవ నాగరికత ముగింపుకు సంభావ్య ప్రారంభాన్ని ప్రస్తావించారు. కానీ ఇండియా, పాకిస్థాన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. అయినప్పటికీ, కొంతమంది వ్యక్తులు రెండు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను బాబా వంగా అంచనాలతో అనుసంధానిస్తున్నారు. ఆమె దూరదృష్టి ప్రస్తుత పరిస్థితికి వర్తిస్తుందని నమ్ముతున్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణీకుడి తత్తరపాటు.. ఆపి తనిఖీ చేయగా




హైదరాబాద్:బంగారం ధరలు ఆకాశాన్నంటడంతో.. అక్రమ రవాణాకు హద్దే లేకుండా పోయింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో బంగారం అక్రమ రవాణాను అడ్డుకున్నారు. దుబాయ్ నుంచి బంగారం తెస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు కస్టమ్స్ అధికారులు. దుబాయ్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఓ ప్రయాణికుడి దగ్గర మూడున్నర కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు 10 బంగారు బిస్కెట్‌లను మూడు జేబుల్లో అమర్చుకొని వస్తుండగా పట్టుకున్నారు అధికారులు. నిందితుడికి ఎయిర్‌పోర్టులోని గ్రౌండ్ స్టాఫ్ సహకరించినట్లు గుర్తించారు. పట్టుబడ్డ బంగారం విలువ మూడు కోట్ల 45 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఇటీవల బంగారం తులం లక్ష దాటడంతో.. అక్రమ రవాణాను ఎంచుకున్నారు. దుబాయ్‌లో తక్కువకు కొని.. ఇక్కడికి తరలిస్తున్నారు. నిందితుడితో ఎవరు బంగారం తెప్పిస్తున్నారనేది కూపీ లాగుతున్నారు.దర్యాప్తులో 3500 గ్రాముల బరువు, 99.9% స్వచ్ఛత కలిగిన బంగారు బిస్కెట్‌లను ప్రయాణీకుడు, గ్రౌండ్ సిబ్బంది సమన్వయంతో రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. విమానాశ్రయ పార్కింగ్ ప్రాంతంలో వేచి ఉన్న మరొక గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఏజెంట్‌కు బంగారాన్ని తెలివిగా డెలివరీ చేయాలనేది వారి ప్లాన్. అతను కస్టమ్స్ ఇబ్బందులను క్లియర్ చేసిన తర్వాత బంగారాన్ని ప్రయాణీకుడికి తిరిగి ఇవ్వాలన్నది టాస్క్. అయితే అధికారుల అప్రమత్తలో వీరి ప్రయత్నం భగ్నమైంది. మూడు వేర్వేరు ప్యాకెట్లలో దాచి ఉంచిన మొత్తం 30 బంగారు బిస్కెట్‌లు, ప్యాకింగ్ సామాగ్రిని కూడా ఐ=x అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# మోడీ రాక వేళ అమిత్ షాకు వైసీపీ ఫిర్యాదు..!

అమరావతి :ఏపీలో అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభం కోసం ఇవాళ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి వస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానాలు పంపింది. ఇదే క్రమంలో వైసీపీ అధినేత జగన్ కు కూడా ఆహ్వానం పంపినా ఆయన మాత్రం రావడం లేదు. ఈ నేపథ్యంలో మరో అంశంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు వైసీపీ ఫిర్యాదు చేసింది.ఏపీ పుణ్యక్షేత్రాల్లో భద్రతా లోపాలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వైసీపీ ఎంపీ గురుమూర్తి ఫిర్యాదు చేస్తూ లేఖ రాశారు. రాష్ట్రంలోని ముఖ్యమైన దేవాలయాల్లో పరిపాలనా లోపాలు, తరచూ జరుగుతున్న భద్రతా వైఫల్యాలపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని గురుమూర్తి కోరారు. విశాఖపట్నం జిల్లా సింహాచలం దేవాలయంలో చందనోత్సవం సందర్భంగా గోడ కూలి ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన అంశాన్ని ప్రస్తావించారు. గోడ నిర్మాణంలో సరైన ఇంజనీరింగ్ పద్ధతులు పాటించక పోవడం, నాణ్యత లేని మెటీరియల్ ఉపయోగించడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ఆక్షేపించారు. రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలలో ఇటీవల జరిగిన సంఘటనలని వైసీపీ ఎంపీ తన లేఖలో ప్రస్తావించారు. శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలోని శ్రీ కూర్మనాథ స్వామి ఆలయంలో భక్తులు పవిత్రంగా భావించే అరుదైన నక్షత్ర తాబేళ్లు అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం, పోస్టుమార్టం చేయకుండానే వీటి దహనం చేయడం చట్టాలను, సంప్రదాయాలను ఉల్లంఘించడమే అని ఎంపీ తెలిపారు.అలాగే తిరుమలలో భద్రతా వ్యవస్థ పూర్తిగా తలకిందులైందని పేర్కొన్నారు. జనవరి 8న వైకుంఠ ద్వార దర్శన కౌంటర్ల క్యూ లైన్లలో జరిగిన దురదృష్టకరమైన తొక్కిసలాట తర్వాత కూడా టీటీడీ పరిపాలనలో ఎలాంటి మార్పు రాకపోవడం బాధాకరం అన్నారు. ఇటీవల కాలంలో మూడంచెల భద్రతా వ్యవస్థను దాటి ఒక భక్తుడు పాదరక్షలతో సింహ ద్వారం వరకు వెళ్లడం వ్యవస్థలోని లోపాలకు నిదర్శనం అన్నారు. టిటిడి గోశాలలో 100కు పైగా గోవులు చనిపోవడాన్ని కూడా ప్రస్తావించారు. గోశాల నిర్వహణలో నిర్లక్ష్యం, గోవులకి నాణ్యతలేని దాణా అందించడం, వైద్య సేవల లోపం, అజాగ్రత్త గోవుల మరణానికి కారణమయ్యాయని



తెలిపారు.ఈ నేపథ్యంలో ఆలయాల్లో భద్రతా వైఫల్యాలపై వెంటనే ప్రత్యేక విచారణకు ఆదేశించాలని ఎంపీ గురుమూర్తి అమిత్ షాను కోరారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు, భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ జోక్యం అవసరమని ఎంపీ తెలిపారు. భారత దేశం యొక్క ఆధ్యాత్మిక వారసత్వాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు.

# కాంగ్రెస్ ఛాంపియన్ అని చెప్పుకొంటోంది గానీ..

హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రకటించిన కుల గణన తరువాత పరిణామాలు మారుతున్నాయి. ఇది తమ ఘనతగా కాంగ్రెస్ పార్టీ చెప్పుకొంటోంది గానీ- అసలు లెక్కలు మాత్రం వేరేగా ఉంటోన్నాయి. వాటన్నింటినీబ బీజేపీ ఒక్కటొక్కటిగా బహిర్గతం చేస్తోంది.కుల గణనలో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు చేస్తోన్న ప్రకటనలు, గతానుభవాలకు ఏ మాత్రం పొంతన ఉండట్లేదు. దాని ట్రాక్ రికార్డ్ పూర్తిగా భిన్నం. సంస్థాగత నిర్లక్ష్యం, విధానపరంగా తీసుకోవాల్సిన నిర్ణయాల్లో తీవ్ర జాప్యం, నెరవేరని హామీలు.. కాంగ్రెస్ ఖాతాలో ఇబ్బడి ముబ్బడిగా కనిపిస్తాయి.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుండి కాంగ్రెస్ సమగ్ర కుల గణనను నిర్వహించకుండా తప్పించుకుంటూ వచ్చిందనేది బహిరంగ రహస్యం. దీనివల్ల దేశానికి కీలకమైన డేటా అందుబాటులో లేకుండా పోయింది. ఓబీసీలు, సాధారణ సామాజిక వర్గాలతో సహా అన్ని కులాల జనాభా, ఆర్థిక స్థితిగతులపై కాంగ్రెస్‌కు ఎలాంటి పట్టింపు లేదనేది తేలిపోయింది.కులాల ఆధారంగా జనాభా లెక్కలు తీయకపోవడం, డేటా సేకరణను ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ వచ్చింది కాంగ్రెస్. సమగ్ర కుల గణన 1931లో బ్రిటిష్ పాలనలో నమోదైంది. 1941 జనాభా లెక్కల్లో కులాల సమాచారం చేర్చినప్పటికీ, రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా అది విడుదల కాలేదు.1951లో దేశం తన మొదటి జనాభా గణనను నిర్వహించినప్పుడు, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం కుల గణనను పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం- దశాబ్దాలుగా నిష్క్రియాత్మకంగా ఉండటానికి పునాదివేసింది. రాజకీయ కారణాలతో ఉద్దేశపూరకంగా దీన్ని పక్కనపెట్టింది.ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం, తమ హక్కుల కోసం కులం ఆధారంగా జనాభా లెక్కలను సేకరించాలంటూ చాలా ఓబీసీలు గానీ, ఇతర ప్రాంతీయ పార్టీలు గానీ డిమాండ్ చేసినప్పటికీ- కాంగ్రెస్ దాన్ని ఏనాడూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ అన్యాయాన్ని సరిదిద్దడానికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ క్రియాశీలకంగా వ్యవహరించడంలో విఫలమైంది.2011 నాటవి జనాభా లెక్కల్లో కుల డేటాను చేర్చాలంటూ 2010లోనే అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని తోసిపుచ్చింది. లాజిస్టికల్ సవాళ్లను కారణంగా చూపించింది. కొన్నిసార్లు కుల గణన ప్రాముఖ్యతను తక్కువ చేసి చూపించింది.అన్ని రకాలుగా ఒత్తిడి ఉన్నప్పటికీ కాంగ్రెస్ కుల గణనకు అంగీకరించలేదు. 2011లో సామాజిక-ఆర్థిక కుల గణన నిర్వహించడానికి మాత్రమే అంగీకరించింది. ఈ సర్వే- ప్రధాన జనాభా లెక్కల నుండి విడిగా నిర్వహించింది. ఫలితంగా కుల గణన అనేది మరుగున పడింది.కర్ణాటక కాంగ్రెస్ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా నాటి నివేదికల విడుదలను వ్యతిరేకించారు. వక్కలిగ, లింగాయత్‌ల వంటి బలమైన సామాజిక వర్గాల నుండి వ్యతిరేకత వస్తుందనే భయాలను వ్యక్తం చేశారు. ఇది-



